నందివెలుగు ముక్తేశ్వరరావు
9491428078

ప్రకటన మాత్రమే సరిపోతుందా...

ఇటీవల మన దేశ ప్రధాని భాష విషయంలో ఒక ప్రకటన చేసారు. రాబోయే రోజులలో మాతృభాషలో అన్ని స్థాయిల్లో డిగ్రీ, స్నాతకోత్తర స్థాయిలో కూడా విద్యాబోధన ఉంటుంది అన్నది ఆ ప్రకటన సారాంశం. జులై 28 వ తారీఖున జరిగిన అఖిల భారతీయ శిక్షా సమాగమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్రింది అంశాలని ప్రస్తావించారు.

1. మాతృభాషలో విద్యా బోధన అనేది భారతదేశంలోని విద్యార్థులకు సరికొత్త రూపంలో న్యాయం చేస్తుంది.
2. ఇది సామాజిక న్యాయానికి అతి ముఖ్యమైన మెట్టు .
3. ఏ విద్యార్థినైనా సామర్థ్య ఆధారంగా కాకుండా ఇంగ్లీషు భాష ఆధారంగా జడ్జ్ చేయడం అతిపెద్ద అన్యాయం.
4. విద్య మరియు నైపుణ్యాల పాఠ్యాంశాలు 12 భాషలల్లో అనువాదాలు విడుదల చేస్తున్నాం.
5. బోలెడన్ని వ్యవస్థితమైన ప్రాంతీయ భాషాలున్నా , వాటిలో చదువులని వెనకబాటు తనానికి గుర్తుగా చూపిస్తున్నాం.
6. ఆంగ్లంలో మాట్లాడటం రానివాళ్లను ఖాతరు చేయడం లేదు. వాళ్ల ప్రతిభా శక్తియుక్తుల్ని గుర్తించడం లేదు. అందువల్లే, పల్లెలనుంచి వచ్చిన పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.
7. ప్రతి వాళ్ళు వాళ్ల భాషల్లో వాళ్ళు ఆత్మవిశ్వాసంతో ఉంటే వాళ్ల నైపుణ్యాలు , శక్తి యుక్తులు సహజంగానే వికసిస్తాయి.

పై ప్రకటన మొత్తం చూసిన తరువాత దేశంలో విద్యావిధానంలో ఉన్న సమస్యలకు మూలాలు కనుక్కోవడంలో ప్రధాని చాలా మంచి ప్రయత్నమే చేసారు అని తెలుస్తోంది. ఇది సమాజ పురోగతినీ దేశ ప్రజల అభివృద్ధినీ కోరుకుంటున్న ప్రతి ఒక్కళ్ళు ఆనందపడే విషయం. దీనిని సహృదయంగా స్వాగతిస్తాం. ప్రభుత్వాలు దీనిని మనసా, వాచా, కర్మణా అమలు చేస్తాయని ఆశిద్దాం. అయితే కేవలం సదాశయాలు, సదుద్దేశాలు లోకాన్ని ముందుకు తీసుకుపోవు. వాటితో పాటు కట్టుదిట్టమైన కార్యాచరణ విధానం రూపొందించుకోవాలి. అలా రూపొందించుకున్న కార్యాచరణ విధానాన్ని తు.చ. తప్పకుండా ఆచరించి తీరాలి. అప్పుడు మాత్రమే ఇలాంటి ప్రకటనలు సార్థకం అవుతాయి.

ఈ సందర్భంలో నేను ఒక ప్రధానమైన ఉదాహరణని పేర్కొంటున్నాను. ప్రపంచీకరణ విధానాలు వచ్చిన కొత్తల్లో చాలా దేశాలు మేమంటే మేమని అంతర్జాతీయ మార్కెట్ లోకి చొరబడవచ్చని పోటీ పడ్డాయి. కానీ, కొన్ని దేశాలు ప్రపంచం అంతా ఒక మార్కెట్ గా మారుతున్న తరుణంలో అన్ని దేశాలతో మనం ఎదురొడ్డి నిలవాలి అంటే మన ప్రమాణాల్ని కూడా అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని గుర్తించాయి. ఆ మేరకు కొన్ని దేశాలు ఆ దేశపు రైతులని, ఆ దేశపు కార్మికులను, ఆ దేశపు పెట్టుబడిదారులను, ఆ దేశపు వృత్తి పనుల వారిని , అటు నైపుణ్యాలు పెంచడం, ప్రపంచ స్థాయిలో మేలైన ఉత్పత్తులని బయటకు తీసుకురావడం కోసం దాదాపు రెండు సంవత్సరాలపాటు శిక్షణ కార్యక్రమాలని నిర్వహించాయి. దీనితో పాటు ఆ దేశపు పరిశోధన-అభివృద్ధి (R&D) విభాగాలకు అంతర్జాతీయ ప్రమాణాల గురించి అవగాహన చేయించారు. ఇలా రెండు సంవత్సరాల కాలం పరిశోధన శిక్షణ కార్యక్రమాలని నిర్వహించడం వలన దేశంలోని అన్ని రంగాల ఉత్పత్తి వ్యవస్థలు సమూలంగా మారిపోయి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను ఆ దేశాలు చేరుకున్నాయి. అప్పటివరకు మిణుకు మిణుకు మంటున్న వాళ్ల ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ స్థాయిలో అగ్ర రాజ్యాలుగా రూపొందాయి.

పైన చెప్పిన ఈ ఉదాహరణతో మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఏదైనా సాధించాలి అంటే ప్రభుత్వాలు కేవలం అనుకున్నంత మాత్రాన సరిపోదు. దానికోసం సమాజాన్ని సన్నద్ధం చేయాలి. సమాజాన్ని మనం చేయాలనుకున్న అంశం వైపు మనం నడిపించాలి. ఆధునిక పరిపాలన భాషలో వీటిని కమ్యూనిటి మొబైలైజేషన్ అంటున్నారు. ఇలాంటి ప్రయత్నం లేకుండా ఫలితాలు రావు.

దీనికోసం మనం ఏమి చేయాలి?

1. అధ్యయనం: ఇలాంటి కార్యక్రమం విజయవంతం కావాలంటే విద్యావ్యవస్థలో ఉన్న అనేక సంస్థలు వాటిల్లో పని చేసే అధ్యాపకులు అందరూ దీనిని కేవలం ఒక భావనగా మాత్రమే కాకుండా అవసరంగా గుర్తించాలి. దానికోసమని ప్రత్యేక శిక్షణ, వ్యవస్థ మార్గదర్శనం అవసరం అవుతుంది. కేవలం జి.ఒలతో పనులు జరగవు. ప్రస్తుతం సమాజంలో తల్లితండ్రుల అవగాహన ఏమిటి? ఆ అవగాహన అలా ఏర్పడటానికి మూల కారణాలు ఏమిటి ? ఇటు స్కూలు స్థాయిలోనూ ఉన్నత స్థాయిలోనూ అధ్యాపకులు ఏమి కోరుకుంటున్నారు, అలా అనుకోవడానికి కావలసిన పరిస్థితులు ఏమిటని క్షుణ్ణంగా అధ్యయనం చేయందే అర్థం కాదు.

2. భ్రమని తొలగించాలి : విద్యారంగంలో ఒక ప్రధానమైన సమస్య. ఏది భ్రమ , ఏది సత్యం అన్నదాంట్లో రావాల్సినంత స్పష్టత రాకపోవడం విచారకరం. ఉదాహరణకి శాస్త్రం, శాస్త్ర గ్రంథాలు, శాస్త్ర విషయాలు ఇంగ్లీషులోనే చెప్పాలని అనుకోవడం, ఇంగ్లీషు మీడియమే అన్నిటికీ పరిష్కారం అనుకోవడం లాంటి భ్రమలు చాలా పట్టి పీడిస్తున్నాయి. భ్రమల్ని తొలగించాలంటే ప్రత్యేక అధ్యయన నివేదికలు, కేస్ స్టడీస్ రూపొందించుకోవాలి. భ్రమలని శాస్త్రీయంగా కూలదోయాలి.

3. శాస్త్ర పరిభాషలని తయారు చేయడం : మన దేశం చాలా కాలం వలస పాలనలో ఉండటం ఒక సమస్య, వలస పాలన నెత్తికి ఎక్కించుకుని, వలసని కొనసాగించడం అసలైన సమస్య. ఏ

శాస్త్రమైనా నేర్చుకోవాలంటే దేశ భాషలే సరైన మార్గం అని దాదాపు వంద సంవత్సరాల క్రితం నుంచి కొమర్రాజు వేంకట లక్ష్మణ రావు గారు, మహాత్మా గాంధీ పేర్కొన్నారు. భౌతిక శాస్త్రాలు , జీవ శాస్త్రాలు , వైద్య శాస్త్రాలు , సాంకేతిక విజ్ఞానం మొదలైనవి మన ప్రాంతీయ భాషలో చెప్పుకోవడం ఏమాత్రం కష్టం కాదు, పైగా తేలిక! ఉన్న ఒకే ఒక్క సమస్య ఫలానా శాస్త్రంలో వాడే ఫలానా పదానికి సరిపోను పారిభాషిక పదం మన దగ్గర ఉండాలి. ఈ పారిభాషిక పదాలను మనం రూపకల్పన చేసుకోవాలి. ఈ సమస్య మన నెత్తినే పొద్దు పొడవలేదు. జపాన్ కూడా ఒకప్పుడు మనలాగే వలస పాలన అనుభవించింది. అయినా వలస పాలకులు ఉన్న రోజుల్లోనే దేశ భాషలలో విజ్ఞాన శాస్త్రాలు రూపొందించుకున్నది. దానికోసం ప్రత్యేకంగా అనువాద శాఖలని ఏర్పాటు చేసుకుని ఆయా శాస్త్రాల నిపుణులతో చర్చించి పరిభాషా పదకోశాలని నిర్మించింది. సాధారణంగా శాస్త్రాలలో వాక్య నిర్మాణం సులభంగా సూటిగా ఉంటుంది. ఆ నిర్మాణాన్ని కూడా అనువాదాల్లో అనువర్తింప చేసుకున్నారు. ఆ ప్రకారం సాఫ్ట్ వేర్ లను రూపొందించుకుని ప్రపంచ స్థాయిలో వచ్చే ఎంతటి మహత్తర శాస్త్ర గ్రంథమైనా ఒక్క రోజు తిరక్కుండానే ప్రామాణికంగా అనువాదం చేసే వ్యవస్థని ఆ దేశం నిర్మించుకుంది. అందువలన బడిలో చేరిన మొదటి రోజు నుండి , విశ్వ విద్యాలయ స్థాయి వరకు అన్ని విజ్ఞాన శాస్త్రాలని సాంకేతిక విజ్ఞానాలని జపనీస్ భాషలోనే అందిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు చూస్తున్న జపనీస్ కార్టూన్ లు , వీడియో గేమ్ లు ఎన్నో! పూర్తిగా జపనీస్ భాషలో ఉన్న ప్రజలు వాటిని భాష తెలియకపోయినా ఆదరిస్తూనే ఉన్నారు.

భిన్నత్వంలో ఏకత్వ భావన ఉన్న భారతదేశంలో దేశవ్యాప్తంగా ఒకేరకమైన పారిభాషిక పద కల్పన కష్టమేమీ కాదు. ఉత్తర భారతదేశం వారికి హిందీ ప్రధాన భాషగా ఎంపిక చేసుకొని పారిభాషిక పద కల్పన చేయవచ్చు. దక్షిణ భారతదేశంలో ఉన్నవన్నీ ద్రావిడ భాషలే. వాటిల్లోనూ తెలుగు తమిళ కన్నడ మలయాళ భాషలు ప్రధానమైనవి. లిపి లేని ఇతర భాషలు కొన్ని ఉన్నా అవి ఈ నాలుగు భాషలలో ఏదో ఒక భాషతో అనుసంధానమై ఉంటాయి. అందువల్ల ఈ నాలుగు భాషలకు ఉపయోగపడేటట్లు ఒకేరకం పారిభాషికపద కల్పన చేయాలి. టి.బరో,ఎంబి ఎమెనో రూపొందించిన ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీఆధారంగా ఈ పారిభాషిక పద కల్పన చేసుకోవచ్చు.

పైచర్చకు సారాంశం ఏమిటంటే అనువాద శాఖలను నిర్మించడం, పరిభాషా పదకోశాలను తయారు చేయడం, యంత్రానువాదాలను (accurate) సులభతరం చేయడం.

ఆఖరిగా బోధనా మాధ్యమం అనేది, యదార్థానికి, బోధనకి సంబంధించిన విషయం కాదు. తరగతి గదిలో భావ ప్రసారానికి సంబంధించిన విషయం. తరగతి గది ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాలంటే నేర్చుకొనడం అనే ప్రక్రియ సహజంగానూ ఆనంద దాయకంగా ఉండాలంటే మాతృభాషలోనే విద్యావిధానం ఉండాలనేది సత్యం. అలాంటి రోజులు రావాలంటే అలాంటి పరిస్థితులు ఏర్పడాలంటే బోలెడంత సన్నాహక కార్యక్రమం (Preparatory work)) పైన పేర్కొన్న విధంగా చేయాలి. లేకపోతే ప్రధాని ఆశయం ముందుకు వెళ్ళదు. ఏదైనా సాధించాలి అంటే, సంకల్పంతో పాటు ప్రణాళిక, కట్టుదిట్టమైన కార్యాచరణ ఉండాలి. ఉంటుందని ఆశిద్దాం

రచయిత సమైక్య తెలుగు రాష్ట్ర ప్రభుత్వంలో నల్గొండ జిల్లా పాలనాధికారిగా, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక ,తెలుగు భాష శాఖ కార్యదర్శిగా పనిచేశారు. వీరు తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఉన్నారు.